క్లుప్తంగా

అన్ని రంగాల్లోనూ రాణించాలి



మహిళా సాధికారతపై అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్ మహేష్, మహిళా పోలీస్ మంగ

డెంకాడ: వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి మహేష్, మహిళా పోలీస్ మంగ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా డెంకాడ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత, దిశ యాప్‌పై వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు



చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ కార్మికుడు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి మొయిద జంక్షన్ సమీపంలోని బ్రిడ్జి వద్ద చెత్త పేరుకుపోవడంపై సాక్షిలో 'పారిశుధ్యం అధ్వానం' పేరుతో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చెత్తా, చెదారాలు తొలగించడంతో ప్రయాణికులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరాగాంధీకి ఘనంగా నివాళి



ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు సరగడ రమేష్, తదితరులు

డెంకాడ: దివంగత ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పెదతాడివాడ జంక్షన్ వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్ ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాకాడ రమణ అప్పలరెడ్డి, పి.రేఖచిలకరాజు, రాము, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పైకి మురుగునీరు



మురుగు నీటితో నిండిపోయిన మొయిద జంక్షన్ రహదారి

నెల్లిమర్ల: రహదారులు, భవనాల శాఖ నిర్లక్ష్యంతో రహదార్లు చెరువుల్లా మారుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగర పంచాయతీ పరిధి మొయిద జంక్షన్ నుంచి జరజాపుపేటకు వెళ్లే రహదారిలో కల్వర్టు పూడుకుపోయి మురుగునీరు రోడ్డు మీదకు చేరుకుంది. దీంతో ప్రయాణికులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం



ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి సూరు కామేశ్వరరావు, కామేశ్వరమ్మ, సూర్య నారాయణ, సాయిగీత దంపతులు రూ.50,116 ఆర్థిక సహకారం అందజేశారు. ఈ మేరకు ఆదివారం తమ నివాసంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆలయాన్ని భారీ అంచనా వ్యయంతో నిర్మిస్తున్నామని దాతలు సహకారం అందించాలని కోరారు. ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, దాసరి రవి, దిలీప్‌కుమార్ ధనూకా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి క్షీరాభిషేకం

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆదివారం పంచామృతాభిషేకాలు చేశారు. అమ్మవారికి ప్రత్యేకమైన రోజు కావడంతో ప్రతీ ఆదివారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించ డం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు మధ్యాహ్నం ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో అన్నప్రసాద వితరణ చేశారు.

డ్వాక్రా మహిళలకు అండగా 'స్త్రీ నిధి'

- రూ.24.48 కోట్ల రుణాల మంజూరు



దుస్తుల దుకాణంలో దొంతల బంగారమ్మ

రెండు రోజుల్లోనే రుణం..



స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొందాలనుకునే పొదుపు సంఘాల్లోని మహిళలకు స్త్రీనిధి ద్వారా రెండు రోజుల్లోనే రుణం మంజూరు చేస్తాం. రూ. పది వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణాలు ఇస్తాం. తీసుకున్న రుణాన్ని నెలవారీ తిరిగి చెల్లించాలి. లబ్ధిదారు మరణిస్తే ఇన్సూరెన్స్ ద్వారా రుణం మాఫీ అవుతుంది. స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.ఉమామహేశ్వరరావు, స్త్రీనిధి ఏజీఎం, విజయనగరం



జొన్నాడలో ఏర్పాటు చేసిన గిఫ్టు ఆర్టికల్ షాపు వద్ద సారిక రాజేశ్వరి

వెంటనే రుణం..

స్వయం ఉపాధి పొందాలన్న ఉద్దేశంతో స్త్రీనిధి రుణానికి దరఖాస్తు చేసుకున్నాను. అడిగిన వెంటనే రుణం మంజూరు చేయడంతో గ్రామంలోనే దుస్తుల దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాను.

– దొంతల స్వాతి, గుణుపూరుపేట



స్త్రీనిధి అప్పుతో కొనుగోలు చేసిన గొర్రె పిల్లలతో గుడ్డాల బంగారమ్మ

కులవృత్తిలో భాగంగా..

కులవృత్తిలో భాగంగా గొర్రెల పెంపకం కోసం స్త్రీ నిధి ద్వారా రుణాన్ని తీసుకున్నాం. దీంతో గొర్రె పిల్లలు కొనుగోలు చేసి పెంచుతున్నాం. వీటి పెంపకం ద్వారా ఆదాయం కూడా వస్తోంది. ఉపాధి కోసం వేరేచోటుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది.

– గుడ్డాల బంగారమ్మ, పినతాడివాడ గ్రామం

డెంకాడ: చిరు వ్యాపారాలు చేయాలనుకునే పొదుపు సంఘాల మహిళలకు స్త్రీనిధి చేదోడుగా మారింది. జీవనోపాధి పొందాలనుకునే వారికి వైఎస్సార్ క్రాంతిపథంలోని స్త్రీనిధి ఆర్థిక భరోసా కల్పిస్తోంది. ఒక్కో సభ్యురాలకు రూ.10 వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణాలను అందిస్తున్నారు. కిరాణా దుకాణం, డెయిరీ యూనిట్, పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్, కూరగాయాల వ్యాపారం, విసనకర్రల తయారీ, గొర్రెలు, మేకల పెంపకం, పూల మొక్కల పెంపకం, వ్యవసాయ అవసరాలకు, మినీ ట్రాక్టర్, సెలూన్, బ్యూటీపార్లర్, పెరటికోళ్ల పెంపకం, దుస్తుల వ్యాపారం, గిఫ్ట్ ఆర్టికల్స్ షాపుల నిర్వహణకు మహిళలకు స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తారు. రుణం తీసుకునే వారికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తారు. దురదృష్టవశాత్తూ మరణిస్తే వారి రుణం ఇన్సూరెన్స్ ద్వారా మాఫీ జరుగుతుంది. దీంతో స్త్రీనిధి ద్వారా ఉపాధి పొందేందుకు మహిళలు మొగ్గుచూపుతున్నారు.

- 100 శాతానికి మించి రుణాలు..

విజయనగరం క్లస్టర్ పరిధిలో డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ, విజయనగరం మండలాలున్నాయి. ఈ మండలాల్లో లక్ష్యాలను మించి స్వయం ఉపాధికి రుణాలు అందజేశారు. డెంకాడ మండలంలో 1084 మందికి రూ.6.5 కోట్ల రుణ లక్ష్యం కాగా.. 1133 మందికి 6.65 కోట్ల రూపాయలను రుణాలుగా అందించారు. భోగాపురం మండలంలో 900 మందికి రూ.5.2 కోట్ల రుణ లక్ష్యం కాగా.. 700 మందికి రూ.5.22 కోట్లు మంజూరు చేశారు.

- పూసపాటిరేగ మండలంలో 1250 మందికి రూ.7.5 కోట్ల రుణ లక్ష్యం కాగా.. 1144 మందికి రూ.7.55 కోట్లు రుణాలుగా అందించారు.
- విజయనగరం మండలంలో 835 మందికి రూ.5 కోట్ల రుణ లక్ష్యం కాగా.. 795 మందికి రూ. 5.11 కోట్ల రుణ సౌకర్యం కల్పించారు.

సూపర్ బెస్ట్ క్లబ్‌గా 'విజయనగరం వాసవీ క్లబ్'



అవార్డు తీసుకుంటున్న సతీష్, నాగరాజు

విజయనగరం: సేవా కార్యక్రమాలు నిర్వహించిన క్లబ్‌లకు వాసవీ ఇంటర్నేషనల్ అవార్డులు ప్రకటించింది. ఒడిశాలోని బరంపురంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు కృషిచేయడం, ఆర్థికంగా వెనుకబడిన మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం.. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యసేవలు.. అంధులు, వృద్ధులకు సాయం చేయడంలో విజయనగరం వాసవీ క్లబ్ ఎనలేని సేవలందించిందని చెప్పారు. అందుకే క్లబ్‌ను సూపర్ బెస్ట్ క్లబ్‌గా ఎంపిక చేసినట్లు చెప్పారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్, కార్యదర్శి సముద్రాల నాగరాజులకు క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ ఆత్మకూరి సతీష్ అవార్డ్ అందజేశారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ ఆలవెల్లి శేఖర్, గుంపిన నారాయణరావు, కట్టమూరి రత్నారావు, ఏవీ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు



విజయనగరం అర్బన్: క్విజ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

నెల్లిమర్ల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జరజాపుపేట గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఆదివారం నిర్వహించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ జె. నారాయణమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సేవా సంఘ ఉపాధ్యక్షుడు కడలి ప్రకాశరావు, రిటైర్డ్ హెచ్ఎం సుంకరి వాసుదేవరావు, కె.విజయశ్రీ, ఉపాధ్యాయులు, యువకులు పాల్గొన్నారు.

- క్విజ్ పోటీలు

విజయనగరం అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని గాజులరేగ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు గ్రంథాలయ అధికారి నారాయణరావు జ్ఞాపికలు అందజేశారు.

సత్యసాయి పల్లకీ సేవ

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులోని సత్యసాయి మందిరంలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ స మితి కన్వీనర్ పి.కేశవరావు ఆధ్వర్యంలో పుణ్యగిరి రోడ్డులోని మందిరం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా సత్యసాయి చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగించారు. సత్యసాయి భక్తులు భజన పాటలు పాడుతూ, మేళతాళాలు వాయిస్తూ పల్లకిసేవలో పాల్గొన్నారు.



సత్యసాయి పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

డిసెంబర్ 3న వాకర్స్‌క్లబ్ జిల్లాస్థాయి సమావేశం



వాకర్స్ క్లబ్ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

శృంగవరపుకోట: డిసెంబర్ 3వ తేదీన వాకర్స్ క్లబ్ 102 జిల్లా సమావేశం నిర్వహించనున్నామని, సభ్యులంతా హాజరు కావాలని పుణ్యగిరి వాకర్స్ క్లబ్ అధ్యక్షు డు బుగత వెంకటేశ్వరరావు కోరారు. క్లబ్ సభ్యుల సమావేశం పట్టణంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెలా కనీసం రెండు సేవా కార్యక్రమాలు నిర్వహించేం దుకు సభ్యులు అంతా తీర్మానించారు. ఆర్.త్రినాథరావు, ఆర్.వెంకన్న, ఎం.రామకృష్ణ, ఎ.మల్లేశ్వరరావుకు ఎంజీఎఫ్ సభ్యులుగా సభ్యత్వం కల్పించారు. క్లబ్ సభ్యులు పి.గంగరాజు, ఎం.వెంకటరమణ, సీహెచ్.సుబ్బారావు, పి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మనగుడి కార్తీక మాస ఉత్సవాలు

విజయనగరం టౌన్: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 27 వరకు ఉభయ జిల్లాల్లో మనగుడి కార్తీకమాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ప్రొగ్రామింగ్ అసిస్టెంట్ జె.శ్యామ్‌సుందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన రామాలయాల్లో మనగుడి కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే 27న కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు విష్ణు, లలిత సహస్రనామ పారాయణాలు, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

అధికారులు పట్టించుకోక పోవడం దారుణం..

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ

నెల్లిమర్ల: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరాహార దీక్ష చేపడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణ అన్నారు. నిరాహార దీక్షలకు మద్దతుగా ఆదివారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ హాస్టల్ విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని ఆపాలని.. జూనియర్, డిగ్రీ కళాశాలలో లెక్చరర్ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, గిరిజన విశ్వవిద్యాలయ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. దీక్షలకు మద్దతుగా ఈనెల 21 మంగళవారం నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిలో ప్రతిఒక్కరూ పాల్గొని తమ సమస్యలను వినిపించాలని కోరారు.

వాహన తనిఖీలు

వేపాడ: మండలంలోని బొద్దాం జంక్షన్‌లో వల్లంపూడి ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ఇటీవల చైన్ స్నాచింగ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. బొద్దాం జంక్షన్‌లో ద్విచక్రవాహనాలు, కార్లను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో అపరిచితులు ఎవరైనా సంచరిస్తే ప్రజలు తక్షణమే సమాచారం అందించాలని ఎస్ఐ రాజేష్ కోరారు.

వైభవంగా గాయత్రీ యజ్ఞం



ర్యాలీ చేస్తున్న రుత్వికులు

చీపురుపల్లి: కార్తీకమాసం సందర్భంగా స్థానిక కొత్తఅగ్రహారంలోని ఆర్యసమాజంలో ఆదివారం ఉదయం గాయత్రీ మహాయజ్ఞం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆర్య సమాజం నుంచి గాంధీబొమ్మ జంక్షన్, మెయిన్‌రోడ్, ఆంజనేయపురం, లావే రురోడ్ తదితర ప్రాంతాల్లో రుత్వికులు ఆధ్యాత్మిక ర్యాలీ నిర్వహించా రు. అలాగే యోగా శిబిరం ఏర్పాటు చేశారు. ఒడిసా, హైదరాబాద్, హరిద్వార్, ఢిల్లీ నుంచి వచ్చిన పలువురు ఆచార్యుల ఆధ్యాత్మిక ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం చేశారు.

మెరుగైన వైద్యం అందించండి



బాధితులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: గ్యాస్ సిలిండర్ పేలిన సంఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఎల్. కోట గవరవీధిలో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇద్దరు మహిళలు, ముగ్గురు చిన్నారులకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ బాధితులను ఆదివారం పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ రమణ, డాక్టర్ శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాప్ వార్షికోత్సవం



పట్టణ నిరాశ్రయుల వసతిగ్రహంలో ఆహారం పంపిణీ చేస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్

విజయనగరం: జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) 31 వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక పట్టణ నిరాశ్రయుల వసతిగృహంలో నిర్వహించిన వార్షికోత్సవానికి మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వృద్ధులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, జర్నలిస్టులు సమాజ నిర్మాణానికి దిక్సూచీలాంటివారన్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, జర్నలిస్టుల వార్షికోత్సవం నిరాశ్రయుల నడుమ జరుపుకోవడం గొప్ప విషయమన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మెట్ట రాజశేఖర్‌కు నగదు సహాయం అందజేశారు. కార్యక్రమంలో జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవనాపు సత్యనారాయణ, అధ్యక్షుడు మానపురం రవి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.వి.ఆర్, గోపాల్ వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.పరుశురాం, కార్యనిర్వాహక కార్యదర్శి వి.గౌరీ శంకరరావు, కోశాధికారి యాగంటి రవి, కార్యదర్శులు ఎం.హేమంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజూ కొనసాగిన నిరాహార దీక్ష



దీక్షకు మద్దతు తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద చేపడుతున్న నిరాహార దీక్షలు మూడో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా నిరాహార దీక్షకు మద్దతుగా యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె. విజయగౌరి మహిళా విభాగం నాయకులతో కలిసి శిబిరం వద్దకు చేరుకుని మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాల వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని ఆరోపించారు. పాఠశాలల విలీనాన్ని నిలిపివేయాలని కోరారు. 2021లో పూర్తవ్వాల్సిన సెంట్రల్ యూనివర్సిటీ పనులు ఇప్పటికీ మొదలు పెట్టకపోవడం సిగ్గు చేటన్నారు. శ్రామిక మహిళా సంఘ నాయకురాలు సుధారాణి మాట్లాడుతూ, వసతిగృహాల్లో ఉండే అమ్మాయిలకు శానిటరీ నాప్‌కిన్స్ కూడా ఇవ్వలేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రామ్మోహన్ మాట్లాడుతూ, మూడు రోజులుగా నిరాహార దీక్ష చేపడుతున్నా అధికారుల నుంచి కనీసం స్పందన లేకపోవడం బాధాకరమని వాపోయారు. సమస్యలు పరిష్కరించని ఎడల ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

పుస్తకాల వితరణ

విజయనగరం అర్బన్: పట్టణానికి చెందిన పలువురు స్థానిక లంకాపట్నంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయానికి పుస్తకాలు వితరణగా అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, ఉత్తమ సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలు దోహదపడతాయని.. అటువంటి గ్రంథాలయాల ఏర్పాటుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. దాతల ద్వారా పుస్తక హుండీకి వచ్చిన పుస్తకాలే కాకుండా గ్రంథాలయాలకు అవసరమైన పుస్తకాలను అందించేందుకు కూడా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కె.దయానంద్, సంఘ వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, పాడుగు ఈశ్వరరావు, సోము గురునాథ్, ఆర్జీ శ్రీను, ఆర్జీ ప్రభు, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందుకుంటున్న గ్రంథాలయ సేవా సంఘ ప్రతినిధులు

శివాలయంలో ప్రత్యేక పూజలు

బొండపల్లి: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోగ్యం బాగుండాలని ఆకాంక్షిస్తూ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్లపూడి కృష్ణ ఆధ్వర్యంలో నెలివాడ గ్రామ శివాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి బొత్స ఇటీవలే హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. ఆయన త్వరగా కోలుకుని ఇంటికి ఆరోగ్యంగా చేరుకోవాలని కొబ్బరి కాయలు కొట్టి అభిషేకాలు చేశారు. నాయకులు పి.రాము నాయుడు, ఎం.కృష్ణ, టి.త్రినాథ, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.